క్లుప్తంగా

'నిడుగల్'ను పర్యాటక కేంద్రంగా గుర్తించండి



స్వామివార్ల విగ్రహాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: దక్షిణ భారత దేశంలో రెండో హంపీగా పేరు పొందిన నిడుగల్ దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించాలని నిడుగల్ వాల్మీకి ఆశ్రమాధిపతి సంజయ కుమార స్వామిజీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. తాలూకాలోని నిడుగల్ దుర్గం లో దేవరాయన రొప్ప గ్రామస్తులు నిర్వహించిన దసరా ఉత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంఘ సంస్థలు, కన్నడ పర సంఘాలు నిడుగల్ దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించేందుకు కృషి చేయాలన్నారు. దసరా ఉత్సవాల ఊరేగింపులో కళా బృందాలు ప్రదర్శించిన వివిధ కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. నిడుగల్ దుర్గంలోని మారెమ్మ, బసవణ్ణ, ఈశ్వర, ఈరణ్ణ, నరసింహస్వామి ఉత్సవ మూర్తులను ఘనంగా ఊరేగించారు.

28న మండల సర్వసభ్య సమావేశం

మడకశిరరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన 28న ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సోనీబాయి తెలిపారు. అధికారులు శాఖల వారీగా ప్రగతి వివరాలతో రావాలన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత పెనుకొండ



విజేతకు నగదు, ట్రోఫీ అందిస్తున్న ఎంపీపీ చంద్రశేఖర్

రొద్దం: దసరా పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన రొద్దం గల్లీబాయ్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో పెనుకొండ విజేతగా నిలిచింది. టోర్నమెంట్‌కు వివిధ ప్రాంతాల నుంచి 20 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు చెప్పారు. గెలుపొందిన పెనుకొండ జట్టుకు బుధవారం ఎంపీపీ చంద్రశేఖర్ చేతుల మీదుగా రూ. 20 వేల నగదు, ట్రోఫీ అందజేశారు. అదేవిధంగా రన్నర్‌గా నిలిచిన రొద్దం జట్టుకు రూ. 15 వేల నగదు, ట్రోఫీ అందించారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

మడకశిర: మడకశిరలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు రొళ్ల మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

సమాజ సేవకుడు లింగన్న మృతి



లింగన్న (ఫైల్)

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరుకు చెందిన సమాజ సేవకుడు, అమరాపురం వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, కర్ణాటక కురుబ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు విశ్రాంత ఇంజినీర్ లింగన్న (86) మంగళవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్నేహితులు, బంధువులు లింగన్న స్వగృహానికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళులర్పించినట్లు కుటుంబ సభ్యులు లీలావతి, సురేష్ తెలిపారు. గురువారం అమరాపురం మండలంలోని హలుకూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా షాజ్‌వాన్



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని వైఎస్ హొసకోట గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా జేడీఎస్ మద్దతుదారులు సయ్యద్ షాజ్‌వాన్ 22 ఓట్లు, ఉపాధ్యక్షురాలిగా శోభ 21 ఓట్లతో ఎన్నికయ్యారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో తమ సమీప ప్రత్యర్థులు, కాంగ్రెస్ మద్దతుదారు కేశవమూర్తికి 10 ఓట్లు, అక్షరకు 9 ఓట్లు పడ్డాయి. దీంతో షాజ్‌వాన్, శోభ గెలుపొందారు. తహసీల్దార్ వరదరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

వరి సాగు .. భలే బాగు

- పెనుకొండ నియోజకవర్గంలో 3500 ఎకరాల్లో వరి సాగు
- రెండు నెలల్లో చేతికందనున్న పంట
- మార్కెట్‌లో బియ్యానికి డిమాండ్
- అన్నదాతకు అన్ని విధాలా అండగా ఉన్న ప్రభుత్వం



పెనుకొండ మండలం వెంకటగిరిపాళ్యం వద్ద సాగులో ఉన్న వరి

పెనుకొండ: నియోజకవర్గంలో వరి పంటను రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారు. ఎక్కడ చూసినా చెరువులు, బావుల కింద వరి పంట కనిపిస్తోంది. ప్రస్తుతం పంట గింజదశకు చేరుకుంది. మరో రెండు నెలల్లో కోతకు సిద్ధం కానుంది.

ఐదేళ్ల క్రితం కరువు పరిస్థితులు

ఐదేళ్ల క్రితం పెనుకొండ నియోజకవర్గంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని ఉండేవి. పశువులకు మేత లేకపోవడంతో ప్రభుత్వం పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఉండేది. చేసేదిలేక రైతన్నలు పశువులను కబేళాలకు అమ్మేసేవాళ్లు. చెరువులన్నీ ఎండిపోయి కళావిహీనంగా దర్శనమిచ్చేవి. దీనికి తోడు బోరు బావుల్లో కూడా నీళ్లు వచ్చేవి కావు.

బోరు బావుల్లో సమృద్ధిగా నీళ్లు

గత నాలుగేళ్లుగా చెరువుల్లో తగినంత నీరు ఉంది. అదేవిధంగా వరుస వర్షాలతో చెరువుల్లో నీరు తగ్గకపోవడంతో రైతులు వరిసాగు చేసేందుకు మంచి అవకాశం ఏర్పడింది. అలాగే గత రెండేళ్లుగా నిరవధికంగా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణాజలాలను నియోజకవర్గంలోని పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, పరిగి మండలాలతో పాటు పక్కనే ఉన్న హిందూపురం, మడకశిర నియోజకవర్గాలకు చెరువులకు వదలడం వంటి కారణాలతో చెరువుల్లో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. దీనికితోడు బోరు బావుల్లో గంగమ్మ తొణికిసలాడుతుండటంతో రైతులకు నీటి సమస్యే లేకుండా పోయింది.

పెనుకొండలో వరి సాగు ఇలా...	
పెనుకొండ	245 హెక్టార్లు
సోమందేపల్లి	200 హెక్టార్లు
రొద్దం	316 హెక్టార్లు
పరిగి	300 హెక్టార్లు
గోరంట్ల	350 హెక్టార్లు

మార్కెట్లో బియ్యానికి డిమాండ్

వేరుశనగ పంట రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూర్చకపోవడంతో రైతులు వరి పంట సాగుపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. పలువురు రైతులు భూములను కౌలుకి తీసుకునిమరీ పంట వేశారు. ప్రస్తుతం మార్కెట్లో కూడా బియ్యానికి డిమాండ్ ఉంది. 50 కేజీల బియ్యం ప్యాకెట్ రూ.2 వేలకు పైగా పలుకుతుండటంతో వరిసాగు లాభదాయకంగా ఉందని రైతులు చెబుతున్నారు.

సోనా, బీపీటీనే అధికం

నియోజకవర్గంలోని రైతులు వరి సాగుకు ఎక్కువగా మొగ్గు చూపుతుండగా.. అందులోనూ సోనా, బీపీటీ రకాలనే ఎక్కువగా వేస్తున్నారు. 4 నుంచి 5 నెలల్లో పంట చేతికి అందేలా చూసుకుంటున్నారు.

వరి పంట బాగుంది



బోర్లు, బావుల్లో, చెరువుల్లో నీరు ఉండటం, భూగర్భజలాలు పెరగడంతో వరిసాగుకు అనుకూలంగా మారింది. ప్రతి యేటా క్రమం తప్పకుండా వరి సాగు చేస్తున్నాము. సోమందేపల్లి గ్రామ పొలం కింద నేను ఎకరాలో వరి సాగు చేశాను. నీటికి ఎలాంటి ఇబ్బందిలేకపోవడంతో పంట బాగుంది.

\- వడ్డి శ్రీరాములు, సోమందేపల్లి

నాలుగేళ్లుగా సాగు చేస్తున్నా



నాలుగేళ్ల క్రితం మునిమడుగు చెరువు కింద భూములన్నీ బీళ్లుగా ఉండేవి. చెరువులోకి క్రమం తప్పకుండా ప్రతియేటా వర్షపు నీటితో పాటు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని మళ్లిస్తున్నారు. దీంతో ముళ్ల పొదలతో నిండి ఉన్న భూములు నేడు వరిసాగుతో కళకళలాడుతున్నాయి. చిన్న గ్రామం అయినా 60 ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేశారు. - సత్యనారాయణ, మునిమడుగు

రైతులకు అన్ని విధాలా అండ

నియోజకవర్గంలోని ప్రతి మండలంలో వరి పంట సాగులో ఉంది. చెరువుల్లో తగినంత నీరు ఉండటం, భూగర్భజలాలు సమృద్ధిగా ఉండటంతో పంట సాగుకు ఇబ్బంది లేకుండా పోయింది. రైతులకు కావాల్సిన ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం యూరియాకు ఎంతో డిమాండ్ ఉన్నా ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందిస్తున్నాం. మా సిబ్బంది కూడా రైతులకు సూచనలు, సలహాలిస్తూ పంట దిగుబడికి చర్యలు తీసుకుంటున్నారు.

\- శంకర్‌నాయక్, ఏఓ, పెనుకొండ

'రాజకీయ లబ్ధి కోసమే వాల్మీకుల మధ్య చిచ్చు'



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

హిందూపురం టౌన్: రాజకీయ లబ్ధి కోసం కొందరు వాల్మీకుల మధ్య చిచ్చురేపుతున్నారని వాల్మీకి ఆలయ నిర్మాణ కమిటీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక స్థానిక శ్రీనివాస వాటర్ ప్లాంట్ వద్ద వాల్మీకి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, వాల్మీకులు విలేకరులతో మాట్లాడారు. కొన్నేళ్లుగా వాల్మీకులందరూ ఐక్యంగా ఉంటూ సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. అయితే కొంత మంది వాల్మీకి సంఘాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కొద్దిరోజుల క్రితం జరిగిన వాల్మీకి సంఘం సమావేశం జరిగినప్పుడు లెక్కలు అడిగినందుకు తమపై దాడికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకి జయంతి లోపు వాల్మీకి సంఘానికి సంబంధించి లెక్కలు బహిరంగంగా తెలపాలని, లేకపోతే వాల్మీకి జయంతి రోజున నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామని అన్నారు. కార్యక్రమంలో వాటర్ నరేష్, లక్ష్మీనారాయణ, బీఎస్ మూర్తి, వినయ్ కృష్ణ, డీకే లక్ష్మీనారాయణ, ముద్దరంగప్ప, చెన్నప్ప, కొండప్ప, రమేష్, తిప్పన్న, దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

శాఖల వారీగా సమీక్షిస్తాం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ ఎస్టిమేట్ కమిటీ సభ్యులు పర్యటించనున్నట్లు కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే తిప్పేస్వామి ఫోన్‌లో 'సాక్షి'కి తెలిపారు. అమరావతిలో కమిటీ చైర్‌పర్సన్ కళావతి అధ్యక్షతన బుధవారం జరిగిన కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు చెప్పారు. ఈ పర్యటనలో శాఖల వారీగా ఆర్థికపరమైన అంశాలు, అంచనాలను సమీక్షిస్తామన్నారు. ఇతర రాష్ట్రాలకు కూడా వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తామని చెప్పారు. తొలుత టీటీడీకి సంబంధించిన ఆర్థిక స్థితిగతులను ఈ కమిటీ సమీక్షిస్తుందని తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన తేదీలను ఖరారు చేస్తామన్నారు.

పశుగ్రాసం దగ్ధం

రొద్దం: మండల పరిధిలోని రాచూరులో బుధవారం విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. నాగిరెడ్డి అనే రైతు పశుగ్రాసం కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా విద్యుత్ వైర్లు తాకడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయన్నారు. గ్రాసం మొత్తం కాలిబూడిదైందన్నారు. గ్రామంలో విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉండటం తోనే ప్రమాదం జరిగిందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్ !



కొండూరులో విద్యుత్ స్తంభం నుంచి ఎత్తుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్



కల్లూరులో రాగి వైరు చోరీ కావడంతో ఖాళీగా ఉన్న బాక్సు

- కాపర్, ఆయిల్ కోసం ధ్వంసం
- వరుస చోరీలపై పోలీసులు నిఘా ఉంచాలంటున్న ప్రజలు

లేపాక్షి: హిందూపురం విద్యుత్ డివిజన్ పరిధిలో పలుచోట్ల ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు, ఆయిల్ కోసం వాటిని ధ్వంసం చేస్తూ తీరని నష్టం చేకూరుస్తున్నారు.

- కొండూరు, కల్లూరు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. అయితే నెల క్రితం దొంగలు అక్కడ ఏర్పాటు చేసిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి వైరును దొంగలించారు.
- నాలుగు నెలల క్రితం సోమందేపల్లి మండంలోని మేకలపల్లి గ్రామంలో పంచాయితీ బోరుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న ఆయిల్, కాపర్‌వైరు దొంగలించుకెళ్లారు. దీంతో రూ. 30 వేలు నష్టం వాటిల్లడమే కాకుండా తాగునీటి సమస్య ఏర్పడింది.
- చిలమత్తూరు మండలంలోని టేకులోడు క్రాస్ వద్ద ఉన్న జగనన్న కాలనీలో కూడా ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. సుమారు ఒకటిన్నర లక్షలు నష్టం వాటిల్లినట్లు విద్యుత్ అధికారులు పేర్కొన్నారు.
- లేపాక్షి మండల వ్యాప్తంగా రైతులకు సంబంధించిన వ్యవసాయ బోర్లలో ఉన్న మోటార్లు కూడా వరుసగా అపహరణకు గురవుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా పోలీసులు వరుసగా జరుగుతున్న దొంగతనాలపై గట్టి నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిర్యాదులు అందాయి

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఎక్కువ చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరుగుతున్నాయి. రూ.లక్షలు విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేయడంతో పాటు అందులో ఉన్న ఆయిల్, కాపర్ వైర్ దొంగిలిస్తున్నారు. దీని వల్ల ఆ ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. హిందూపురం డివిజన్‌లో 5 చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనాలు జరిగినట్లు పోలీసుల ద్వారా మాకు ఫిర్యాదులు అందాయి. ఈ కాలనీల్లో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తాం.

\-భూపతి, ట్రాన్స్‌కో ఏఈ, హిందూపురం

అయోడిన్ ఉప్పుతో ఆరోగ్యం



మాట్లాడుతున్న వైద్యాధికారిణి స్వరూపరెడ్డి

పరిగి: శరీర దృఢత్వానికి, వివిధ రుగ్మతల నివారణకు అయోడైజ్డ్ ఉప్పును మాత్రమే ఉపయోగించాలని మండల వైద్యాధికారులు తెలిపారు. జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవాలను మండల పరిధిలోని హొన్నంపల్లిలో బుధవారం నిర్వహించారు. పరిగి మెడికల్ ఆఫీసర్ స్వరూపరెడ్డి, ఊటుకూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రూబీ మాట్లాడుతూ అయోడిన్ అనేది ఒక సూక్ష్మ పోషకమని సాధారణంగా అయోడిన్ లోపం వల్ల గాయిటర్, గర్భస్రావం, మృత శిశువులు జన్మించడం, తక్కువ బరువున్న శిశువు పుట్టడం వంటివి జరిగే ఆస్కారం ఉందన్నారు. అలాగే బుద్ధి మాంద్యం, చెవిటి, మూగ, మరుగుజ్జుతనం వంటి వైకల్యాలు సంభవిస్తాయన్నారు. వాటి నివారణ కోసం అయోడిన్ కల్గిన ఉప్పును తినడంతో పాటు పోషక విలువలు ఉండే ఆహారాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, పీహెచ్‌ఎన్ వెంకమ్మ, ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాలరెడ్డి, పర్యవేక్షకులు పార్వతి, వాసు, ఎంఎల్‌హెచ్‌పీలు షబానా, మమత తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



హిందూపురం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక లక్ష్మీపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో 11వ వార్డు కౌన్సిలర్ అంజలి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హారతి, డాక్టర్ మంజుశ్రీ, అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, సచివాలయ అడ్మిన్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల పరిధిలోని పులేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు ఆరోగ్య సురక్ష క్యాంపును నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి హోదాలో జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశాన్ని వైద్య సిబ్బంది, వలంటీర్లు ప్రతి గడపకూ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య శిబిరాలకు వచ్చేలా చూడాలన్నారు.

చిలమత్తూరు: పేద ప్రజల సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేశారని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. మండలంలో చిలమత్తూరు -3 సచివాలయ పరిధిలోని సంజీవరాయునిపల్లిలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యశ్రీ, 108, 104, ఫ్యామిలీ ఫిజీషియన్ ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష ఇలా ప్రజారోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, వైద్యాధికారులు నికేష్, హర్ష మిత్ర, సర్పంచ్ సంధ్య ,ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న వలిబాషా

హిందూపురం అర్బన్: పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తామని రెండో పట్టణ సీఐగా బుధవారం బాధ్యతలు చేపట్టిన వలి బాషా పేర్కొన్నారు. చోరీల నివారణకు చర్యలు చేపడుతూనే గంజాయి, మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం డీఎస్పీ కంజాక్షన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

హిందూపురం టౌన్: జిల్లాలోని 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. వేరుశనగ, మొక్కజొన్న, హార్టికల్చర్ పంటలు వేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.40 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నాయకులు సిద్దారెడ్డి, ఆదినారాయణ, రెడ్డప్పరెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



అశ్వత్థనారాయణకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి రామచంద్రారెడ్డి

మడకశిర: మండలంలోని హరేసముద్రం గ్రామానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు అశ్వత్థనారాయణ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈయన 2019 ఎన్నికల్లో మడకశిర నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. బుధవారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కండువా వేసి అశ్వత్థనారాయణను పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రంగేగౌడ్, వాగేష్, రవిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఊరేగింపు

గుడిబండ: మండల కేంద్రంలో వెలసిన వీరభద్రస్వామిని బుధవారం ఘనంగా ఊరేగించారు. దసరా పండుగ అనంతరం స్వామివారిని ఊరేగించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగానే భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్రికెటర్ దీపికకు సన్మానం



క్రికెటర్ దీపికను సన్మానిస్తున్న సిద్ధలింగేశ్వరస్వామి

అమరాపురం: మండలంలోని తంబలహట్టి గ్రామానికి చెందిన క్రికెటర్ దీపికను తుమకూరు సిద్దగంగా మఠాధీశులు సిద్ధలింగేశ్వరస్వామి ఘనంగా సత్కరించారు. శిర పట్టణంలో జరిగిన స్నేహ సామరస్యం జీవన విధానం అనే కార్యక్రమంలో మెమెంటో, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా సిద్ధలింగేశ్వరస్వామి మాట్లాడుతూ కర్ణాటక బార్డర్‌లోని అమరాపురం మండలానికి చెందిన దీపిక అంధుల ప్రపంచ క్రికెట్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించడం హర్షణీయమన్నారు. ఆమెను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. చదువు ఆటకు పేదరికం అడ్డు రాదన్నారు.

రూ.4.50 లక్షలతో చౌడేశ్వరి ఆలయానికి రంగులు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవాలయానికి తన సొంత ఖర్చుతో పెయింటింగ్ వేయించడానికి ఆ గ్రామానికి చెందిన కరణం రామానందన్ ముందుకొచ్చారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, కోడిపల్లి సర్పంచ్ మంజునాథ్, జయచంద్ర, మోహన్, కృష్ణమూర్తి తదితరులు గ్రామపెద్దలతో ఆలయంలో సమావేశమయ్యారు. రామానందన్ మాట్లాడుతూ రూ.4.50 లక్షలతో చౌడేశ్వరిదేవి ఆలయం లోపల పెయింటింగ్స్ వేయిస్తానని చెప్పారు.

మాలధారులకు గాయాలు

గోరంట్ల: పాదయాత్రగా శబరిమల వెళ్తున్న అయ్యప్ప మాలధారులపైకి బుల్లెట్ దూసుకెళ్లడంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాలమేరకు... తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాకు చెందిన 90 మంది అయ్యప్ప మాలధారులు శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్నారు. తమ్మినాయినపల్లి సమీపంలో జాతీయ రహదారిపై కోడూరు వైపు నుంచి వస్తున్న బుల్లెట్ వారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో శివప్రసాద్, జ్ఞానేశ్వర్ అనే ఇద్దరు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం

హిందూపురం: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ముఖ్యమంత్రి ఎందుకు కావాలంటే' కార్యక్రమం స్థానిక ఆర్‌కె ఫంక్షన్‌హాల్‌లో నేడు (గురువారం) 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ -17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలు ఎంపికై నట్లు హెచ్‌ఎం రంగప్ప, పీఈటీ మహేశ్ తెలిపారు. సాఫ్ట్‌బాల్‌కు సుకన్య, బేస్‌బాల్ పోటీలకు దాక్షాయని, అక్షయ ఎంపికై నట్లు పేర్కొన్నారు. నవంబర్ 4, 5, 6 తేదీల్లో కడపలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు.

నేడు వీరభద్రస్వామి అగ్నిగుండం



అలంకరణలో వీరభద్రస్వామి

అగళి: మండల పరిధిలోని మధుడి వీరభద్రస్వామిలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం వీరభద్రస్వామి అగ్నిగుండం మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.